నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 13 : వసంత నగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోకుల్ ప్లాట్స్, కేపీ హెచ్‌బీ కాలనీ 6 పేజ్, భగత్ సింగ్‌నగర్ పేజ్ 2, వసంత నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సరోజినీ నాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగరాజు

కొండాపూర్, ఫిబ్రవరి 13 : కొండాపూర్ డివిజన్ పరిధి మాదాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలో గురువారం సరోజినీ నాయుడు జయంత్యుత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవలింగం అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య గుండిమెడ నాగరాజు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సరోజినీ నాయుడు నైటింగేల్ ఆఫ్ ఇండియాగా, స్వాతంత్ర్య సమరయోధురాలుగా, కవయిత్రిగా, అఖిల భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలిగా ప్రసిద్ధి చెందారన్నారు. నేటి మహిళలు ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బలక్ష్మి, మంగ, మాధురి, మధుసూదన్ రెడ్డి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరించాలి

అల్లాపూర్, ఫిబ్రవరి13: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్‌గౌడ్ కార్పొరేటర్ సబియా బేగానికి గురువారం వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా స్ట్రీట్ లైట్లు పనిచేయడం లేదని దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సమస్య, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యలు విన్న కార్పొరేటర్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బంగారు, వెండి ఆభరణాలు అప్పగింత

ఆభరణాలను ఎండోమెంట్ అధికారులకు అప్పగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 13 : కూకట్‌పల్లిలోని శ్రీతారామచంద్రస్వామి దేవాలయానికి చెందిన బంగారు, వెండి వస్తువులను ఎండోమెంట్ కమిటీకి అప్పగించామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. దేవాలయానికి చెందిన సుమారు 637 గ్రాముల బంగారం.. సుమారు 500 గ్రాముల వెండి వస్తువులు ఉన్నాయని, వీటిని భద్రపరిచి ఉత్సవాల అప్పుడు స్వామివారికి అమ్మవార్లకు అలంకరణ చేయాలని సూచించారు. రామాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో బ్రాహ్మణుల నివాసం కోసం గదులు, వంటశాలను నిర్మించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రామాలయ ప్రాంగణంలో 20 అడుగుల ఎత్తు గల హనుమంతుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఆలయంలో ప్రతి ఏటా శ్రీరామ నవమి, ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలన్నారు. ఈ వేడుకల కోసం ఎండోమెంట్ విభాగం నుంచి నిధులు కేటాయించాలని అధికారులను కోరారు. ఆలయంలో పూజలు ఇతర వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో ఆంజనేయులు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కమిటీ సభ్యులు తులసి రామ్ సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీడమ్ ఆయిల్ కంపెనీ ఎండీ ప్రదీప్ చౌదరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సీఎస్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం..

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లిలో సీఎస్ఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఫ్రీడమ్ ఆయిల్ కంపెనీ ఎండీ ప్రదీప్ చౌదరిని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలాజీ నగర్ కాలనీలో 2.5 ఎకరాల ఖాళీ స్థలాన్ని... ఫ్రీడం ఆయిల్ ఆధ్వర్యంలో అద్భుతమైన పార్కుగా తీర్చి దిద్దడం జరిగిందన్నారు. అలాగే రెయిన్ బో విస్తా పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రభుత్వ పాఠశాలను నిర్మించేందుకు ముందుకు రావాలని కోరారు. కూకట్‌పల్లిలో అభివృద్ధిలో భాగస్తులైనందుకు ఫ్రీడమ్ ఆయిల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సేల్స్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి స్థానిక నేతలు మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మియాపూర్ ఫిబ్రవరి 13: చందానగర్ సర్కిల్ పరిధిలో పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు రెండో రోజు కొనసాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు పాదచారులకు అసౌకర్యంగా మారడంతో పుట్‌పాత్ ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. ఈ మేరకు మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి లింగంపల్లి వరకు ఇరువైపులా పుట్ పాత్ పై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారాలు ఇతర దుకాణాలను తొలగించారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా పేర్కొన్న చెత్త ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు డీసీ మోహన్ రెడ్డి తెలిపారు. తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీ హెచ్చరించారు. శాంతి భద్రతలు ట్రాఫిక్ పట్టణ ప్రణాళిక విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తొలగింపులను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్ మరో వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు.

బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపూర్, ఫిబ్రవరి 13 : బీఆర్ఎస్ పార్టీ డైరీ, క్యాలెండర్‌ను చందానగర్‌లో పార్టీ సీనియర్ నాయకులు పారునంది శ్రీకాంత్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు హరీశ్ ముఖ్య అతిథిగా హాజరై డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు అందుబాటులో ఉంటుందని, పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలకు అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బాబు మోహన్ మల్లేశ్ ఎండీ సలీం, రమేశ్, జనార్దన్ గౌడ్ మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, యాదగిరి, వంశీ కృష్ణారావు, రంగారావు మహేశ్‌బాబు, కృష్ణారావు ,ఉమామహేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ప్రజలు

దుండిగల్, ఫిబ్రవరి 13: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజును గురువారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, టీఆర్ఎస్ కార్యకర్తలు ,నేతలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించడంతో పాటు వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ రాజు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్క రిస్తామన్నారు. అనంతరం పలు శుభకార్యాలలో పాల్గొనాలంటూ ఎమ్మెల్సీ రాజుకు పలువురు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

రక్తదాన శిబిరం అభినందనీయం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఏసీపీ హనుమంతరావు

జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 13: అనారోగ్య బాధితులకు ఉపయోగపడేవిధంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. జగద్గిరిగుట్టలో గురువారం సైబర్ బాధితుల ఫౌండేషన్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసింహ ఎస్సైలు రాజేశ్ రంజిత్, అబ్దుల్ కయూం, కల్పన శ్వేత శాంతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) అందించే ఎంబీఏ కోర్సు పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొద టి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్కు రూ.10,000 చొప్పు న చెల్లించి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ సేవలు మరువలేనివి

క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు,మాధవి కుమారి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 13 : జేఎన్టీయూహెచ్ వర్సిటీలో సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ మాధవి కుమారి, మెకానికల్ విభాగం హెచ్ ఓడీ రాంజీనాయక్ ప్రారంభించారు. ముందుగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాలాల్ సమాజానికి అందించిన సేవలు గొప్పవని ఆయన జయంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులకు క్రికెట్, చదరంగం, క్యారం బోర్డు, షాట్ పుట్, త్రో బాల్, హ్యాండ్ బాల్, వ్యాసరచన మొగిలి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బంజారా విద్యార్థి సంఘం చైర్మన్ దరావత్ నరేందర్ నాయక్, వ్యవస్థాపకుడు భూక్య రాజ్ కుమార్, పూర్వ విద్యార్థులు భాను ప్రకాశ్ నాయక్, వర్సిటీ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధరావత్ వినోద్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకాశ్ నాయక్, సిద్ధార్థ, శశి కుమార్, గౌతమ్, సురేశ్, జీవన్, మోహిత్, రాహుల్, తిరుపతి, ప్రణీత, అనూశ, లైలా, సంధ్య, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

టీ - హబ్‌లో 'ఏజెన్సీ అడ్డా' పుస్తకావిష్కరణ

ఏజెన్సీ అడ్డా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అర్చన పురోహిత్

కొండాపూర్, ఫిబ్రవరి 13 : ప్రముఖ బిజినెస్ స్టాటజిస్ట్, ఎంట్రప్రెన్యూర్ అర్చన పురోహిత్ రాసిన 'ఏజెన్సీ అడ్డా' పుస్తకాన్ని గురువారం నాలెడ్జ్ సిటీలోని టీ – హబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్లను వ్యాపారాలతో అనుసంధానించడానికి, భారతదేశ సేవా పరిశ్రమలో సహకారం, వృద్ధిని పెంపొందించడానికి రూపొందించిన వినూత్న మార్కెట్ ప్లేస్ 'ఏజెన్సీ అడ్డా' అన్నారు. టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు, పలు పరిశ్రమల్లోని ఏజెన్సీలు, ఫ్రీలాన్సర్లకు చక్కని వేదికగా మారనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు షోకాజ్ నోటీస్

దుండిగల్, ఫిబ్రవరి 13: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక ఆత్మహత్యకు కారకమైన బాచుపల్లిలోని ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల (ఎస్ఆర్ గాయత్రి) యాజమాన్యానికి మేడ్చల్ జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బైసు పూజిత అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో బుధవారం ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో అధికారులు షోకాజ్ నోటీస్ జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పూజిత మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పాటు ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఇంటర్మీడియట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. కాగా ఇంటర్ విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతుండగా ఏనాడు స్పందించని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి కిషన్ ఎట్టకేలకు ఎస్సార్ జూనియర్ కళాశాలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం నోటీసులు ఇవ్వడంపై సర్వత్రా ఆశ్చర్య ం వ్యక్తమవుతుంది.

బోర్ల నీళ్లు వృథా

అపార్ట్‌మెంట్లకు సరఫరా అవుతున్న ప్రభుత్వ బోరు, బోరు వద్ద ఉన్న మీటర్

- మిషన్‌భగీరథ రాకతో నీళ్లు దుర్వినియోగం
- గేటెడ్ కమ్యూనిటీ విల్లాలకు నీటి సరఫరా
- ప్రతి నెలా రూ.12 వేలకు పైగా బిల్లుల చెల్లింపు
- కొంపల్లి మున్సిపాలిటీ నుంచి దారిమళ్లుతున్న నిధులు

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి13 'అత్త సొమ్ము అల్లుడికి దానం అన్నట్లుగా మారింది.. కొంపల్లి మున్సిపాలిటీ అధికారుల తీరు' గ్రామ పంచాయితీగా ఉన్న సమయంలో ప్రజలకు నీటి సరఫరాను అందించేందుకు ఫాక్సగర్ సమీపంలోని ఉమామహేశ్వర కాలనీలో అధికారికంగా బోరు వేశారు. ఆ నీళ్లు వృథా కాకుండా నిల్వ చేసేందుకు ఎస్సీఎల్ నార్త్ కాలనీలో అండర్ గ్రౌండ్ ట్యాంక్‌ను నిర్మించారు. దీని ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే వారు. దానికి కావాల్సిన కరెంటు బిల్లుతో పాటు ఇతర ఖర్చులకు సంబంధించిన వ్యయాలను పూర్తిగా అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఖాజానా నుంచి చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా గోదావరి జలాలను ఇంటింటికీ అందించి నీటి కొరతను తీర్చింది. దీంతో గతంలో వేసిన బోర్లు, నీటి ట్యాంకులతో పనిలేకుండా పోవడంతో వృథాగా మిగిలిపోయాయి. కానీ ఇక్కడే కొంతమంది దానిని ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగారు. ఆ బోరు నీళ్లు వస్తున్నాయి కానీ ఆ నీళ్లు పబ్లిక్ కు కాదు..ఓ బహుళ అంతస్తుల గేటెడ్ కమ్యూనిటీ ప్రైవేట్ అపార్ట్‌మెంట్లకు నేరుగా కనెక్షన్ కలిపారు. బోరుకు ఉన్న కరెంటు మీటర్ మున్సిపాలిటీ పేరిట ఉంది. ఆ మీటర్ కు ప్రతి నెలా దాదాపుగా రెండు వేల యూనిట్ల వరకు కరెంటు కాలుతుంది. దానికయ్యే ఖర్చు సుమారు నెలకు రూ.12 వేలకు పైగానే మున్సిపాలిటీ ఖజానా నుంచి వెచ్చిస్తున్నారు. దాదాపుగా ఐదేండ్లకు పైగానే ఈ వ్యవహరంతో సుమారు రూ.లక్షలకు పైగానే అధికారికంగా చెల్లిస్తున్నారు. కానీ సదరు ప్రైవేట్ అపార్ట్‌మెంట్ నుంచి స్థానికంగా ప్రైవేట్ వ్యక్తులు ప్రతి నెలా వసూళ్లు చేసుకొని జేబులు నింపుకుంటున్నట్లు చర్చ జరుగుతుంది.

తెలిసే జరుగుతుందా..!

మిషన్ భగీరథ నీళ్లు వచ్చాక ఇలాంటి బోర్ల అవసరాలు వినియోగంలో లేకుండాపోయాయి. కానీ ఇక్కడ మాత్రం ఏండ్ల తరబడి ప్రభుత్వ నీళ్లు.. ప్రైవేట్ వ్యక్తుల పరం కావడం వంటి అంశంపై మున్సిపాలిటీ అధికారులకు తెలిసే జరుగుతుందా అని ప్రశ్నకు ప్రతి నెలా మున్సిపాలిటీ నుంచి చెల్లించే కరెంటు బిల్లులే సాక్ష్యంగా నిలుస్తుంది. 081700422 సర్వీస్ మీటర్ లో గ్రామ పంచాయితీ కొంపల్లి యూనిక్ ఎస్సీనెంబర్ 109660581తో పాటు 7997994234 కమిషనర్ స్థాయి అధికారి వినియోగించే ఫోన్ నంబర్ తో లింక్ అయి ఉండడం గమనార్హం. బిల్లులు చెల్లించినప్పుడైనా, దానిని మరమ్మతులు చేసినప్పుడైనా మున్సిపాలిటీ సిబ్బంది దగ్గరుండి పని చేసినప్పుడైనా దాని వినియోగం లేకుండా ఎలా చెల్లిస్తారని మున్సిపాలిటీలో పని చేసే ఏ ఒక్క అధికారి ప్రశ్నించకపోవడం వెనక తీవ్ర విమర్శలకు తావునిస్తుంది..



కొంపల్లి మున్సిపాలిటీ పేరుపై ఉన్న మీటర్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..

ఒకవైపు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీ అధికారయంత్రాంగం..మరో వైపు ఇలాంటి నిధుల దారిమళ్లింపుపై ఇప్పటి వరకు చర్చకు రాకపోవడంపై యంత్రాంగం పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహరంపై కలెక్టర్ ఆడిట్ యంత్రాంగంతో వ్యయ నివేదికలను తయారు చేసి బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాంటి బోర్ల నీళ్లు దారి మళ్లించకుండా ప్రస్తుతం వేసవి సమీపిస్తుండటంతో పార్కులు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం సరఫరా చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రబీర్ కుమార్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 13: బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వ చ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ప్రబీర్ కుమార్ మండల్ కొన్ని నెలల కిందట నగరంలో పేట్ బషీరాబాద్ ప్రాంతంలోని ఓ డెకరేషన్ గోదాంలో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈనెల 10న బయటకు వెళ్లిన ప్రబీర్ తిరిగి పని స్థలానికి చేరుకోకపోవడంతో తోటి కార్మికులు యజమాని ఆచూకీ కోసం వెతికిన ప్రయత్నం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

మియాపూర్, ఫిబ్రవరి 13: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదని బీజేపీ ఆల్విన్ కాలనీ డివిజన్ నాయకుడు నర్సింగ్ యాదవ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ జన్మభూమి కాలనీ ప్రధాన రహదారిపై కొద్ది రోజులుగా డ్రైనేజీ నీరు పొంగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఫలితంగా మురుగు వాసనతో పాటు విష జ్వరాల బారిన పడే ప్రమాదముందన్నారు ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక పరిస్థితిపై తమ వినతి మేరకు అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు పూర్తి చేయించినట్లు నర్సింగ్ యాదవ్ తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటు పడతామని తెలిపారు.నాయకులు చారి, జిల్లా అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు, అంజయ్య యాదవ్ ,చాందు, విష్ణు ,సురేశ్ శ్రీను ,నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.